www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 నవంబర్ 2025
5
తిరుపతి



బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో తుడ చైర్మన్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 69 వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు 2025-2026 అండర్ 17 బాల బాలికల తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు నవంబర్ 5 వ తేదీ నుండి నవంబర్ 7 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్ 17 క్రీడాకారుల మధ్య జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడ చైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ దివాకర్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, స్థానిక తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అధికారులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు, అధికారులు, క్రీడాకారులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై
ఏసీబీ దాడి



అక్రమ రిజిస్ట్రేషన్లపై ముమ్మర తనిఖీలు.. నిషేధిత భూముల రిజిస్ట్రేషన్‌పై ఆరా

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై తిరుపతి జిల్లా ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. కార్యాలయంలోని క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్ల వ్యవహారాలపై ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు.



కార్యాలయంలో తలుపులు మూసేసి ఏసిబి అధికారులు తనిఖీలు చేస్తుండగా అధికారులను బయటకు పంపిన దృశ్యం

కీలక అంశాలపై ఏసీబీ ఆరా..

ఏసీబీ బృందం రిజిస్ట్రార్ కార్యాలయంలోని ప్రతి ఒక్క ఫైలును, రికార్డును క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ తనిఖీలలో ముఖ్యంగా మూడు కీలక అంశాలపై అధికారులు దృష్టి సారించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు: కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూములను సైతం రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. పెండింగ్‌లో ఉంచాల్సిన రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేశారనే ఫిర్యాదులు అందడంతో, ఆయా డాక్యుమెంట్ల వివరాలను సేకరించారు.

ప్రాంతేతర రిజిస్ట్రేషన్లు: రేణిగుంట మండలానికి, తిరుపతి జిల్లాకు సంబంధించిన ప్రాంతాలు కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి లేదా దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి గల కారణాలను అధికారులు ఆరా తీస్తున్నారు. స్థానికేతరులు ఇక్కడ భూములు లేదా ఆస్తులు రిజిస్టర్ చేసుకోవడం వెనుక ఏమైనా అక్రమాలు దాగి ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

క్రయ విక్రయాల విచారణ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతోంది, ప్రజల నుంచి ఎంత మొత్తంలో రుసుము వసూలు చేస్తున్నారు, అనే విషయాలను తెలుసుకునేందుకు ఏసీబీ అధికారులు అక్కడున్న ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా ప్రశ్నించి వివరాలు సేకరిస్తున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలకు తాళం

ఏసీబీ దాడులు ప్రారంభం కాగానే, రిజిస్ట్రార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లోని వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాధారణంగా రద్దీగా ఉండే డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు, స్టాంప్ వెండర్ల దుకాణాలు అన్నీ హడావుడిగా మూతబడ్డాయి. ముఖ్యంగా లైసెన్స్ లేని దస్తావేజు స్టాంప్ వెండర్లు, డాక్యుమెంట్ రైటర్లు తమ కార్యాలయాలకు తాళాలు వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో దళారులు, అనధికార వ్యక్తుల పాత్ర ఎంతవరకు ఉందో ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

ఏసీబీ కబంధహస్తాల్లో రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పూర్తిగా ఏసీబీ అధికారుల అదుపులో ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డితో పాటు కార్యాలయంలోని సిబ్బందిని అధికారులు విచారిస్తున్నారు. దాడులు ముగిసేవరకు కార్యాలయం లోపల, బయట ఎవరినీ అనుమతించడం లేదు. ఈ దాడుల ద్వారా అక్రమ ఆస్తులు లేదా లెక్కల్లో చూపని నగదు ఏమైనా లభ్యమయ్యాయా అనే దానిపై అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

శ్రవణం సంస్థను పరిశీలించిన టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర శ్రవణం సంస్థను టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఆధునిక పద్ధతుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముందుగా పిల్లల తల్లులతో ఈవో మాట్లాడారు. సమయానికి ఆహారం, నీరు అందుతోందా.. లేదాని, శిక్షణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. శ్రవణంలో చేరాక పిల్లల మాటల ఉచ్ఛరణ, మాటలను అర్థం చేసుకునే సామర్థ్యంలో పురోగతిని తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి అయ్యాక ఆధునిక వినికిడి పరికరాలు అందించే అంశం, మెరుగైన బోధనాంశాలు తదితర అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక తయారు చేయాలని డిఈవోను ఆదేశించారు. తరగతి గదులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మూడేళ్ల లోపు పిల్లలకు బోధిస్తున్న పద్ధతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జీ. భానుప్రకాష్ రెడ్డి, ఈఈ జగన్మోహన్ రెడ్డి, డిఈ సరస్వతి, శ్రవణం ప్రాజెక్ట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషలిస్టుకు విజయాన్ని చేకూర్చిన
ప్రజలకు అభినందనలు : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: న్యూయార్క్ మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక ప్రత్యామ్నాయ గళానికి విజయమని, బడా కార్పొరేట్లపై న్యూయార్క్ ప్రజలు సాధించిన విజయమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ట్రంప్ కుట్రలను, కుతంత్రాలను, బెదిరింపులను ఎదిరించి మేయర్‌గా గెలిచారని కొనియాడారు. వారికి సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అమెరికా గడ్డ మీద ఒక సోషలిస్టు భావాలు కలిగిన అభ్యర్థి విజయం సాధించడం చారిత్రాత్మకమన్నారు. ప్రపంచ ప్రజానీకానికి ఇదొక శుభ సూచికంగా సిపిఎం భావిస్తోందన్నారు. సోషలిజానికి రోజులు చెల్లాయని వల్లిస్తున్న కార్పొరేట్ మీడియా సోషలిస్టుగా ఉన్న మదాన్ని గెలుపును చూసైనా కళ్ళు తెరవాలని హితవు పలికారు. పోరాడే శక్తులకు ఇదొక స్ఫూర్తినిచ్చే అంశమన్నారు. ప్రజలు బెదిరింపులకు అదిరింపులకు జడవరని ముఖ్యంగా న్యూయార్క్ ప్రజలు ముందుచూపుతో ఆలోచిస్తారని ఈ ఘటన తెలియజేస్తుందన్నారు.

వేగ నియంత్రణతో ప్రమాదాలు నివారించండి



హైవేపై స్పీడ్ గన్‌తో వేగాన్ని కొలుస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - నాయుడుపేట: ఈ మధ్యకాలంలో నాయుడుపేట పూతలపట్టు హైవేపై వరుసగా జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు బుధవారం పోలీసులకు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ ఆదేశాల మేరకు, నాయుడుపేట సబ్–డివిజన్ పరిధిలో రోడ్డు భద్రతా చర్యలలో భాగంగా, నాయుడుపేట నుండి తిరుపతివరకు ఉన్న హైవే ప్రాంతంలో ప్రత్యేక రోడ్డు భద్రతా, అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్పీడ్ గన్ యంత్రంను ఉపయోగించి వాహనాల వేగాన్ని పర్యవేక్షించడం, నియంత్రించడం, అలాగే వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడం జరిగింది. నాయుడుపేట డియస్పి చెంచు బాబూ సబ్–డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్పీడ్ గన్ యంత్రం వినియోగ విధానాన్ని వివరించి, హైవేలో అధిక వేగం వల్ల సంభవించే ప్రమాదాలను నివారించే చర్యలపై మార్గదర్శకత్వం అందించారు. వాహనదారులు నిర్దిష్ట వేగ పరిమితులను అతిక్రమించడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న దృష్ట్యా, అధికారులు స్పీడ్ గన్ సహాయంతో వేగాన్ని కొలిచి, అతివేగంగా ప్రయాణించే వాహనాలపై తగిన చలానాలు విధించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణరక్షణ ప్రధాన లక్ష్యంగా "స్పీడ్ కంట్రోల్ అండ్ లైఫ్ కంట్రోల్" అనే నినాదంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది కృషిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు అభినందించారు.

ఎంబియులో కృత్రిమ మేధస్సుపై అవగాహన



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, రంగంపేట, మోహన్ బాబు యూనివర్సిటీలో శక్తి, నియంత్రణ, కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ వ్యవస్థలపై బుధవారం నుండి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు ప్రధాన లక్ష్యం రాబోవు తరానికి కృత్రిమ మేధస్సుపై అవగాహన కలిగించటమేనని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ నిర్వహించగా, దీనికి స్పార్కునెక్ట, ఎస్ఎఎస్ ఎలెక్ట్రికల్స్ ఎల్ఎల్‌పి, భవిష్య ఇరిగేషన్ ప్రైవేట్ లి. సంస్థలు స్పాన్సర్ చేసాయి. ఈ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో విశిష్ట వక్తలుగా పాల్గొన్న డా. అభిషేక్ కుమార్ ఝూ విద్యుత్ వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ సమన్వయంపై ప్రసంగించారు. డా. పి.రాజా పునరుత్పత్తి శక్తి వ్యవస్థలలో తెలివైన నియంత్రణ వ్యూహాల ప్రాముఖ్యతను వివరించారు. మి. జి. మహేశ్ కుమార్, హెడ్ – ఆర్ అండ్ డి, ఇవ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై, పరిశ్రమ – విద్యాసంస్థల భాగస్వామ్యం ద్వారా స్థిరమైన ఆవిష్కరణలను వేగవంతం చేయాలనే అంశాన్ని హైలైట్ చేశారు. సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో గ్లోబల్ అభివృద్ధులను వివరించారు. డీన్ డా. అవిరేని శ్రీనివాసులు, విభాగాధిపతి డా. ఎం.ఎస్. సుజాత, ఇతర విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు. సదస్సు కన్వీనర్లు డా. వి. అరుణ్ మరియు డా. ఎస్. ప్రభు సదస్సు ముఖ్యాంశాలను వివరించి, అన్ని అతిథులు, పాల్గొనేవారు మరియు ప్రాయోజకులకు కృతజ్ఞతలు తెలిపారు.


పోలీసుల ఆంక్షల నడుమ
ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీ

- కేసులకు భయపడి వెనక్కి తగ్గం
- ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని తొలగించాలి
- గుణపాఠంలా కఠిన శిక్ష ఉండాలి : విద్యార్థి సంఘాల నేతలు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ర్యాగింగ్‌ను అరికట్టకుండా, ర్యాగింగ్‌కు మద్దతుగా మాట్లాడిన సైకాలజీ ఆచార్యులు విశ్వనాథరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని, ఇంటరాక్షన్ క్లాసులను రద్దు చేస్తూ ఉప కులపతి వెంటనే సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో–కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్ఎఫ్ఐ ఎస్వీయూ అధ్యక్షులు నరసన్న, కార్యదర్శి వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, ఎన్ఎస్ఎయ్ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, ఎన్ఎల్ఎస్ఏ వ్యవస్థాపకుడు సుందరరాజు, జీఎన్ఎస్ వ్యవస్థాపకుడు శివశంకర్ నాయక్, జేబీఎస్ఎఫ్ కన్వీనర్ భార్గవ్ సాయిలు మాట్లాడుతూ వర్సిటీలో సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి స్వయంగా తరగతిలో కూర్చొని సీనియర్ విద్యార్థుల చేత జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయించాడని ఆరోపించారు. అలాంటి ప్రొఫెసర్‌ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించి బాధిత విద్యార్థినులకు న్యాయం చేయాలన్నారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడిన విద్యార్థి సంఘాల నాయకులపై వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు, రెక్టార్ అప్పారావు కలిసి, వర్సిటీకి సంబంధం లేని మోహన్ నాయుడు అనే వ్యక్తి పేరు మీద క్యాంపస్ పోలీస్ స్టేషన్లో అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తే పోలీసులు చేత భయపెట్టడం దారుణమని, అక్రమ కేసులు బనాయిస్తే విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు భయపడే ప్రసక్తి లేదని హెచ్చరించారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే పరిపాలన భవనం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన విద్యార్థులకు ధైర్యం నింపుతూ విద్యార్థులు ఐక్యంగా ఉండాలని, ఇంటరాక్షన్ క్లాసుల పేరిట సీనియర్ విద్యార్థుల హాస్టల్ గదులకు వెళ్లొద్దని, వర్సిటీలో ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధిత విద్యార్థినీల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా బిడ్డలకు వర్సిటీలో న్యాయం జరగడం లేదని, తప్పు చేసిన ప్రొఫెసర్‌ను యాజమాన్యం కాపాడడానికి ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ ఘటనకు సంబంధించిన టైమింగ్ సీసీటీవీ ఫుటేజ్‌ని చూపించాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో వర్సిటీ విసి, రిజిస్ట్రార్‌లు సహాయం కోరితే తప్ప పోలీసులకు వర్సిటీలోకి అనుమతి లేదన్నారు. శాంతియుతంగా యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. వర్సిటీలో వాచ్మెన్ ఇన్చార్జిలు, వాచ్మెన్లు ఆదనంగా నియమించుకున్న వర్సిటీలో బయటి వ్యక్తులు, విద్యాసంస్థల విద్యార్థులు సాయంత్రం ఐదు నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు ఆ సాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే అప్పుడు పోలీసులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. విద్యార్థి సంఘం నాయకులపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవిత్ర, నరసన్న, అనిత, తిరుమలేశు, షేక్ షా, మన్సూర్, చందు నాయక్, తిప్పేస్వామి, ఆదిత్య, అభిషేక్, ఇమ్రాన్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోచుకోవడం తప్ప.. బాగు చేయడం తెలియదా..?



శ్రీకాళహస్తిలో అర్ధనారీశ్వరాలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదర్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోలకు దోచుకోవడం తప్ప బాగు చేయడం తెలియదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ దేవాలయమైన అర్ధనారీశ్వర ఆలయాన్ని పట్టించుకోపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. అర్ధనారీశ్వరాలయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే తన అనుచర గణంతో కలిసి పరిశీలించారు. కనీసం విద్యుత్ సౌకర్యం లేకపోవడంపై మండిపడ్డారు. చియ్యవరం గ్రామం నుంచి విద్యుత్ సరఫరా చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్తీక మాసంలో అర్ధనారీశ్వరుని దర్శించుకునేందుకు భక్తులు అసంఖ్యాకంగా గా తరలి వస్తుంటారనీ, అయితే వర్షాలకు రోడ్లు దెబ్బ తినడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆలయం చుట్టూ కూటమి నేతలు పదివేల లోడ్లు ఇసుకను అమ్మి జేబులు నింపుకున్నారనీ, కనీసం 10లోడ్ల ఇసుకతో రోడ్డును బాగు చేయలేకపోయారా అంటూ ఎద్దేవా చేశారు. తమ హయాంలో అర్ధనారీశ్వరాలయానికి రోడ్డు వేశామనీ, అభివృద్ధి చేశామని వివరించారు. వెంటనే ఈవో స్పదించకుంటే ఆందోళన వ్యక్తం చేశారు.

సోషలిజం..మానవవికాసం సదస్సు కరపత్రం ఆవిష్కరణ



తిరుపతి, యశోదనగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:1917 లో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవస్ఫూర్తితో యశోదనగర్, వేమనజ్ఞాన కేంద్రంలో సోషలిజం.. మానవ వికాసం అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించనున్నట్లు సిపిఎం నేతలు తెలిపారు. ఈ సదస్సు కరపత్రాన్ని బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. రష్యాలో లెనిన్ నాయకత్వంలో ఒక మనిషి మరొక మనిషిని, ఒక జాతి, మరొక జాతిని దోచుకునే దుర్మార్గ వ్యవస్థను కూలదోసి శ్రామిక రాజ్యం ఏర్పాటు అయిందని తెలిపారు. దోపిడీ వ్యవస్థను నిర్మూలించి సోషలిస్టు వ్యవస్థను ప్రపంచానికి ఎర్రజెండా రాజ్యం పరిచయం చేసిందన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి, పేదరికం లేని సమాజం, సామాజిక న్యాయం జరగాలంటే పెట్టుబడిదారి వ్యవస్థను రూపుమాపాలన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడైనా కూలిపోక తప్పదని, అది చరిత్ర సత్యమని పేర్కొన్నారు. అమెరికాలో సామ్రాజ్యవాదం ట్రంప్ విధానాలుకు వ్యతిరేకంగా న్యూయార్క్‌లో మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి గెలిచారని తెలిపారు. సోషలిస్టు భావాలు గల వ్యక్తి మేయర్‌గా గెలవడం వామపక్ష ఉద్యమాలకు బలోపేతానికి ప్రేరణ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు టి సుబ్రమణ్యం, ఎస్.జై చంద్ర, జి బాలసుబ్రమణ్యం,ఎం మాధవ్, ఎం. నరేంద్ర, పి సాయి లక్ష్మి,ఆర్ లక్ష్మి, పి. బుజ్జి, పద్మ, కే.ఆర్. సుబ్రహ్మణ్యం, సుజాతమ్మ,దేవానంద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో కరపత్రాల పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సోషలిస్ట్ విప్లవ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గూడూరు సి.పి.ఎం, సి.ఐ.టి.యు, కెవిపిఎస్ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను మాయాబజార్, వివేకానంద రోడ్డు, ముత్యాల పేట, ఎన్టీఆర్ కాంప్లెక్స్, గాంధీ మున్సిపల్ బిల్డింగ్స్, రైతు బజార్, రాజా వీధి, ప్రజల నివాసాలు ఉంటున్న ప్రాంతాలలో, ప్రధాన కూడళ్ళలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు పట్టణ కార్యదర్శి బి.వి.రమణయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా కోటేశ్వరరావు, వడ్డిపల్లి చెంగయ్య, కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు, అడపాల ప్రసాద్ ఏంబేటి చంద్రయ్య, యేకుల రమణయ్య, సీనియర్ నాయకులు గండికోట మధు, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చాలీ చాలని వసతి.. సంక్షేమ గృహాల పరిస్థితి

- సంక్షేమ గృహాల్లో విద్యార్థినుల అవస్థలు
- పదేళ్లుగా పూర్తికాని బాలికల హాస్టల్ భవనం




ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, ప్రభుత్వ బాలికల ఎస్సీ ప్రభుత్వ వసతి సంక్షేమ గృహంలో గదులు చాలక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కృష్ణమందిరం ఎదురుగా బాలికల ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలోనే గతంలో ఎస్సీ బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్ గదులను నిర్మించారు. ఇందులో ప్రస్తుతం సంక్షేమ అధికారి కార్యాలయంతో పాటు 12 గదులు ఉన్నాయి. 158 మంది విద్యార్థునులున్నారు. విద్యార్థునులకు గదులు చాలడంలేదని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణానికి భవన నిర్మించాలని అనుమతించింది. అప్పట్లో నిర్మాణం ప్రారంభించి 50 శాతం పనులు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణాలు పూర్తికి నిధులు మంజూరు కాలేదు. రెండవ అంతస్తు నిర్మాణం పూర్తయితే విద్యార్థునులకు అదనపు గదులతో సౌకర్యంగా ఉంటుంది. పక్కనే ఉన్న బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో భోజనశాలతో కలిపి 12 గదులు ఉన్నాయి. ఇందులో 150 మంది పాఠశాల విద్యార్థునులు, 210మంది పోస్టుమెట్రిక్ విద్యార్థునులు ఉన్నారు. వీరు కూడా గదులు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ వసతి సంక్షేమ గృహం నిర్మాణం పూర్తయితే కనీసం కొంత ఊరట లభిస్తుందని విద్యార్థులు కోరుతున్నారు.

స్మార్ట్ సిటీ ఎక్స్‌పోలో కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:స్పెయిన్ లోని బార్సిలోన పట్టణంలో జరుగుతున్న ప్రపంచ స్మార్ట్ సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పోలో తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, విశాఖపట్నం కమిషనర్ కేతన్ గార్గ్‌లు పాల్గొన్నారు. స్పెయిన్‌లోని బార్సిలోన పట్టణంలో ప్రపంచ స్మార్ట్ సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్‌పోకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున రాష్ట్ర పట్టణాభివృద్ధి పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య లు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ ఎక్స్‌పో జరుగుతుంది.

ముఖ్యమంత్రి దంపతుల లండన్ పర్యటన

- ప్రవాసాంధ్ర వైద్యుడు డాక్టర్ గుడారు కళ్యాణ్‌తో చర్చ





ప్రజాశక్తి - తిరుపతి సిటి: లండన్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సతీమణి నారా భువనేశ్వరిలతో ప్రపంచ ప్రఖ్యాత లండన్ కింగ్స్ అండ్ గయ్స్ హాస్పిటల్ కిడ్నీ వైద్య విభాగాధిపతి, తెలుగు బిడ్డ డా. గుడారు కళ్యాణ్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గతంలో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ వైద్యుడిగా పనిచేసి, ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన డా. గుడారు కళ్యాణ్ ప్రతిభను ముఖ్యమంత్రి దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. డా. కళ్యాణ్ రోబోటిక్ విధానంలో నిర్వహిస్తున్న అత్యాధునిక శస్త్రచికిత్సల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరంగా తెలుసుకున్నారు. డా. కళ్యాణ్ యొక్క అత్యున్నత వైద్య నైపుణ్యం, సేవలను సీఎం దంపతులు ఎంతగానో ప్రశంసించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇంతటి ఉన్నత స్థానంలో ఉన్న డా. కళ్యాణ్ తన అపారమైన అనుభవాన్ని, అధునాతన వైద్య పద్ధతులను స్వదేశానికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చి, ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగంలో కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి డా. కళ్యాణ్‌కు సూచించారు. డా. గుడారు కళ్యాణ్ తండ్రి, డా. గుడారు జగదీష్ గత నాలుగు దశాబ్దాలుగా బర్డ్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ సేవానిరతి బాటలోనే డా. గుడారు కళ్యాణ్‌ను కూడా ప్రజలకు సేవ చేయడానికి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విభాగంలో తీసుకురావాలని భావిస్తున్న సమూల మార్పులు, ముఖ్యంగా టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య సేవలను మరింతగా విస్తరించే ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డా. కళ్యాణ్‌తో విస్తృతంగా సమాలోచనలు చేశారు. ప్రపంచ స్థాయి రోబోటిక్, అధునాతన చికిత్సా విధానాలను ఏపీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై చర్చ జరిగిందని తెలిపారు.

కొత్త వైన్ షాప్ ఏర్పాటుపై ఆందోళన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, తిరుపతి రోడ్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం కొత్తగా ప్రారంభమవుతున్న గౌడ వైన్స్ షాప్‌పై స్థానిక ప్రజలు, మహిళలు, చుట్టుపక్కల వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైన్ షాప్ ప్రారంభాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఆ ప్రాంతం పాఠశాలలు, దేవాలయాలు, బస్టాండ్ వంటి ప్రదేశాలకు దగ్గరగా ఉండటంతో మద్యం దుకాణం ఏర్పాటు అనుచితమని పేర్కొన్నారు. ప్రభుత్వ బాలికల హైస్కూల్, కళాశాల విద్యార్థులు ప్రతిరోజూ ఈ మార్గంలోనే ప్రయాణిస్తారని ఈ దారిలో మద్యం షాపు ఏర్పాటు ఆందోళనకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఖాళా ప్రదేశం ఉండటంతో రాత్రి వేళల్లో మందుబాబులు చేరి మహిళలు, పాదచారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజల ఆందోళనను ప్రభుత్వం గమనించి, ఎక్సైజ్ శాఖ ద్వారా స్థల పరిశీలన జరపనుంది. చట్టపరమైన నియమావళి ప్రకారం షాప్ స్థలం.. అనుమతుల దూరం, ప్రజా సౌకర్యాల సమీపం తదితర అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిరసనతో ప్రస్తుతం వైన్ షాప్ ప్రారంభం తాత్కాలికంగా నిలిపివేశారు.

అందరినీ కలుపుకుపోండి : ఎమ్మెల్యే పాశిం



ప్రజాశక్తి - చిట్టమూరు : బుధవారం గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో చిట్టమూరు మండల కన్వీనర్ గణపతి కిషోర్ నాయుడు అధ్యక్షతన జక్కనవాని పల్లి నాయకుడు వేణు రెడ్డి ఆధ్వర్యంలో, పిట్టివానిపల్లి, చిట్టమూరు వైసిపి నాయకులు బట్ట మధు యాదవ్ నాయకత్వంలో కొన్ని కుటుంబాలు టిడిపిలో చేరడం జరిగింది. పాశిం సునీల్ కుమార్ నాయకులకు, వారి అనుచరులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాత నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ కొత్తగా చేరిన నాయకులను, వారి అనుచరులను కలుపుకొని పోతూ ఎటువంటి విభేదాలు లేకుండా ప్రభుత్వ ఫలాలు అందరికీ అందే విధంగా దగ్గరుండి చూసుకోవాలని, పార్టీని బలపరిచే దిశగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం మండల అధికారులతో చిట్టమూరు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు అందులో ప్రతి శాఖల అధికారులను వారి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎం నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఏపీఓ, ఏపీయం, మండల నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండలం, ముత్యాలపాడు పంచాయతీ, నాంచారం పేట గ్రామం ఎస్సీ కాలనీ వాసులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నాంచారం పేటలో నివసిస్తున్నామని శ్మశానానికి వెళ్లే దారిని ఇటీవల ప్రారంభించిన రియల్ ఎస్టేట్ సంస్థ మూసివేసిందని తెలిపారు. శ్మశానానికి వెళ్లే దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే సమస్యని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాంచారం పేట ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇంటిపన్నులతో పంచాయతీల అభివృద్ధి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్లో ఓన్ సోర్సు రెవెన్యూపై ఒక రోజు శిక్షణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ఆర్థిక పరమైన ఆదాయాన్ని సృష్టించుకోవాలని తెలిపారు. ఇంటి పన్ను సంపద కేంద్రంలో ఎరువుల తయారీతో పాటు పలు రకాల పన్నుల ద్వారా పంచాయతీలకు సంపదను సృష్టించుకోవాల్సి ఉందని... ఈ పన్ను వసూళ్లతో పంచాయతీల అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్వో వర్షన్ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధంకండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కార్మిక చట్టాలు అమలుపరచాలని లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. పుత్తూరు ఏఐటియుసి పుత్తూరు డివిజన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం అంబేద్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ శివకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జీతాలు పెంచాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు మహేష్, డివిజన్ ఏఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు గోపి చంద్రబాబు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బాలకృష్ణ నాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సంఖ్య పెంచాలని, ఇన్ పేషెంట్లకు కేస్ షీట్ ఏర్పాటు చేయాలని, ప్రతి ఒక్కరికి మర్యాదపూర్వక సేవలు అందించాలని, ల్యాబ్ పరీక్షలు జరపాలని సిబ్బందికి సూచించారు. రాత్రిపూట కూడా అత్యవసర సేవలు, డెలివరీలు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. జిల్లా వైద్య అధికారి వెంట డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్ 2.0 శిక్షణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ 2.0 కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ 17 సూచికలు, 169 గోల్స్, 243 ఇండికేటర్స్ రీచ్ కావడానికి ప్రపంచ దేశాలు కలిసి పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌ను డెవలప్మెంట్ కోసం రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోటరీ క్లబ్, అమ్మ ఫౌండేషన్ సంయుక్త సేవా కార్యక్రమాలు



పేదవారి ఆకలి తీర్చడం సంతృప్తినిచ్చింది : నాగురయ్య

ప్రజాశక్తి - నాయుడుపేట : పేదవారి అభ్యున్నతికి అభాగ్యులను అన్ని విధాల ఆదుకోవడానికి అమ్మ ఫౌండేషన్, రోటరీ క్లబ్ సంయుక్తంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆదవారం నాగురయ్య పేర్కొన్నారు. నాయుడుపేట లోని రోటరీ క్లబ్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనేకమంది అభాగ్యులకు తోడునీడగా ఉంటూ ఎంతోమంది అభిమానాన్ని చూరగుంటూ ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. అలాగే నాయుడుపేట మండలం, తిమ్మాజి కండ్రిగలో వ్యవస్థాపకరాలు కృష్ణవేణి నడపుతున్న అమ్మ ఫౌండేషన్ ద్వారా పేదవాళ్ల కోసం ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదవాళ్ల అభ్యున్నతికి అన్ని విధాల సహాయ పడుతున్నారు. ఈ రెండు ఫౌండేషన్లు కలసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదవారి అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. రోటరీ క్లబ్ ద్వారా ఇప్పటికే పేదవాళ్లకు, అలాగే భర్తను కోల్పోయిన మహిళలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోంది. అలాగే కృష్ణవేణి అమ్మ ఫౌండేషన్ ద్వారా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పిల్లలకు, క్షయ, హెచ్ఐవి ఇంకా అనేక దీర్ఘకాలిక రోగాల బారిన పడ్డ పేదవాళ్ళకు ఇంటికి అవసరమైన నెలసరి సామానులు, మందులు అందిస్తూ అనేక విధాలుగా ఆదుకుంటుంది. ఈ రెండు ఫౌండేషన్లు సంయుక్తంగా కలసి వారి ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో అన్నదాన కార్యక్రమాలు, పేదవాళ్లకు బట్టలు చదువుకుంటున్న వారికి చదువుకి అవసరమైన పుస్తకాలు ఇలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతోమంది పౌరులను తీర్చిదిద్దిన విశ్రాంత ఉపాధ్యాయులు నాయుడుపేటలోని ట్రినిటీ హాస్పిటల్ అధినేత, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆధవరం నాగూరయ్య అధ్యక్షులుగా రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల గురించి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా మేము చేస్తున్న కార్యక్ర మాలకు క్లబ్‌లోని సభ్యుల సహాయ, సహ కారాలు మరవలేనని, ఈ క్లబ్ ద్వారా ఎంతో మందికి సహాయ పడడం ఎనలేని అనుభూతి నిచ్చింద న్నారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కృష్ణవేణి గురించి మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది అభాగ్యులను ఆదుకుంటూ కృష్ణవేణి సంఘంలో మంచి గుర్తింపు సంపాదించుకుందని ఆమె నడవలేని పరిస్థితుల్లో ఉన్నా కూడా ఎంతోమంది జీవితాలను ఆసరాగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు చేయాలనుకున్న ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. మా రెండు ఫౌండేషన్లు కలిసి గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాల లకు వెళుతున్న సరైన వసతులు లేని పేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమాలను ఉద్దేశించి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆధవరం నాగురయ్య మాట్లాడుతూ మా రోటరీ క్లబ్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేశామని మా రోటరీ క్లబ్ ముఖ్య ఉద్దేశం పేదలకు విద్య, వైద్యం, ఒంటరి మహిళలకు ఆర్థిక అభివృద్ధికై అన్ని విధాలా సహకరించడం అని తెలియ జేశారు. కొంతమంది టీచర్స్ విద్యార్థులకు సరైన దుస్తులు లేవని మా దృష్టికి వచ్చిన వెంటనే మేము స్పందించి అమ్మ ఫౌండేషన్, నాయుడుపేట రోటరీ క్లబ్ సంయుక్తంగా దుస్తులు పంపిణీ కార్యక్రమాలు ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం చిట్టమూరు మండలం లో 600 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. చిట్టమూరు మండలంలోని అరవ-పాలెం కాంప్లెక్స్ పరిధిలోని 20 పాఠశాలలకు రోటరీ క్లాబ్, అమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో దాదాపు 600 మందికి సమ దుస్తులు అంద జేశామని ఆయన తెలియజేశారు. చిట్ట మూరు ఎంఈఓ కృష్ణయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురా లు మంజుల విద్యార్థుల పరిస్థి తి మా దృష్టికి తీసుకువచ్చి ఈ కార్యక్రమం జరిగేందుకు ముఖ్య కారకుల య్యారన్నారు. ఇలాం టి సేవా కార్యక్రమాలు నిరం తరం కొనసాగుతయాని ఆయన తెలిపారు. నేటికీ నాయుడుపేట చుట్టుపక్క ప్రాంతాలలో బెస్ట్ రన్నర్స్ యూఎస్ఏ వారి ఆర్థిక సహాయంతో సుమారు 25 లక్షల వరకు పేదలకు పనికొచ్చే విధంగా అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని అందులో ఎక్కువ శాతం విద్యార్థుల కొరకు చేయడం జరిగిందని అన్నారు. దాతల సహకారంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా ప్రతిరోజు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల నందు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు వారి బంధువులకు అన్నదాన కార్యక్రమం ద్వారా ఆకలి తీర్చడం సంతృప్తినిచ్చిందన్నారు. బెస్ట్ రన్నర్స్ యూఎస్ఏ వారి ఆర్థిక సహాయం రోటరీ క్లబ్ సహాయ సహకారాలతో అమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదవాళ్లకు తోడుగా ఉంటామని తెలిపారు.





హెచ్ఎం జ్యోతి వ్యవహార శైలిపై డివైఈవో విచారణ

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, రాజగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం అమలలో వంట మహిళలతో సంబంధిత ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి వ్యవహరిస్తున్న తీరుపై పుత్తూరు ఇంచార్జ్ డివైఈవో మహేశ్వరరావు విచారణ చేపట్టారు. మంగళవారం పాఠశాలలో వంట చేయడానికి వచ్చిన మహిళలతో హెచ్ఎం జ్యోతి గొడవకు దిగిన నేపథ్యంలో స్వయాన ఉపాధ్యాయ బృందమే రంగంలోకి దిగి వంట చేసిన వైనంపై పత్రికల్లో బుధవారం వార్తా కథనం ప్రచురితమయ్యాయి. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పుత్తూరు డివైఈవో మహేశ్వరరావు రాజగోపాల్ పురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ప్రస్తుతం వంట చేస్తున్న మహిళల పేర్లను ఆన్లైన్లో నమోదు చేయకపోవడం, మధ్యాహ్నం భోజనం పథకానికి విడుదలైన సొమ్ము డ్రా చేసే పరిస్థితి లేకపోవడం, హెచ్ఎం జ్యోతి వ్యవహార శైలి వంటి పలు ఆరోపణలపై డివైఈవో మహేశ్వరరావు విచారణ చేశారు. దీనికి సంబంధించి వంట చేస్తున్న పోలమ్మ, వజ్రమ్మలను విచారించి వ్రాతపూర్వకంగా వారి అభిప్రాయాన్ని స్వీకరించారు. తదనంతరం గత ఆరు నెలలుగా పాఠశాలలో జరుగుతున్న పరిణామాలపై ఉపాధ్యాయులను విచారించి వారి వద్ద వ్రాతపూర్వకంగా తీసుకున్నారు. పేరెంట్స్ కమిటీని కూడా విచారించి వారి అభిప్రాయం కూడా వ్రాతపూర్వకంగా స్వీకరించారు. ఈ సందర్భంగా పుత్తూరు డిప్యూటీ డిఇఒ మహేశ్వర రావు మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలనేదే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అయితే కొత్తగా వంట చేసేందుకు తీసుకున్న మహిళ పేర్లను అప్పట్లో పని చేసిన ఇంచార్జ్ హెచ్ఎం ఆన్లైన్లో ఎందుకు నమోదు చేయలేదన్నది విచారించాల్సి ఉందన్నారు. దీంతోపాటు రెగ్యులర్ హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి కూడా ఇప్పటివరకు ఆన్లైన్లో పేర్లు నమోదు చేయకపోవడంపై కూడా పరిశీలించాల్సిందన్నారు. అయితే మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా కొత్తగా వంట పనులకు తీసుకున్న మహిళల నియామకను సంబంధించి పేరెంట్స్ కమిటీ ఆమోదం కూడా ఉందన్నారు. అయితే దీనిపై పాఠశాలలో ఉపాధ్యాయులు, వంట మహిళలు, పేరెంట్స్ కమిటీ, హెచ్ఎం జ్యోతి తదితరులు వ్రాతపూర్వకంగా ఇచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి సంబంధించిన నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించడం జరుగుతుందన్నారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు

గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పించండి : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, పేరడం గిరిజన కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి మేలుగు రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సత్యవేడు, సిపిఎం కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ పేరడం దళితులు గిరిజనులు గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్తు స్తంభాలు విద్యుత్ తీగలు వీధిలైట్లు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గిరిజనులు చంటి బిడ్డలతో విద్యుత్తు లేక చీకట్లోనే రాత్రింబవళ్లు నివాసం ఉంటున్నా కూడా అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాత్రిపూట పాముల బెడద తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల విద్యుత్తు శాఖ ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రతి గ్రామంలో స్తంభాలు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారని వారి ద్వారానే పేరడం గిరిజనులు కూడా విద్యుత్ స్తంభాలు తీగలు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే విద్యుత్ శాఖ కార్యాలయాన్ని మండలంలోని గిరిజనులందరిని సమీకరించి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పేరడం గ్రామ కమిటీ కార్యదర్శి కృష్ణయ్య నాయకులు అనిల్, సుశీల, రోసిలిన్, భాస్కర్, సెల్వం, కొల్లాపురి వెంకటేశులు, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఏవీకేఆర్' విద్యార్థులు

ప్రజాశక్తి-కోట: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన డిస్క్ త్రో అండర్ 17 పోటీల్లో కోట ఎవికెఆర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు పదవ తరగతి చదివే పాకం గౌతమ్ జిల్లా స్థాయిలో జరిగిన డిస్క్ త్రో పోటీల్లో విజయం సాధించగా, 8వ తరగతి చదివే భవ్యశ్రీ 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 200మీటర్ల పందెంలో 3 వ స్థానం, 80 మీటర్ల హుడ్లర్‌లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని, అదే విధంగా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని ఆపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వల్లీ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులను అభినందించారు.

శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా శ్రీకంటి రామ్మోహన్ రావు ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీ కంటి రామ్మోహన్ రావు ప్రమాణ స్వీకారం చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆయనకు పుష్ప గుచ్ఛం అందచేసి, అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ కంటి రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఆలయ చైర్మన్‌గా ఎంపిక కావడంసంతోషంగా ఉందన్నారు. గతంలో కూడా ఆలయ చైర్మన్‌గా దేవస్థాన అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. శ్రీ కంటికి పట్టణంలోని పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

రహదారులకు మరమ్మతులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పి.వి.కండ్రిక గ్రామ పంచాయతీలో ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంగా పలు వీధుల్లో రహదారులు గుంతల మయమయ్యాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో, సర్పంచ్ ఎనమల కోటమ్మ, వైఎస్ఆర్సిపి మండల ఉప కన్వీనర్ ప్రసాద్ పాల్ పంచాయితీ నిధులతో రహదారుల మరమ్మత్తు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అండర్ 17 బాల బాలికల జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన గూడూరు డివిజన్ క్రీడాకారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రతినిధులు అబ్దుల్ రహీం, ఇశ్రాయేల్ కుమార్‌లు అభినందనలు తెలియచేశారు. రెండు రోజులుగా గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరుగుతున్న 14 నుండి 17 సంవత్సరాల బాల, బాలికల క్రీడాపోటీలలో గూడూరు డివిజన్‌లోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, బాలయపల్లి, దక్కిలి మండలాల నుండి నెల్లూరులో జరిగే జిల్లా స్థాయి క్రీడపోటీలకు ఎంపికై నెల్లూరు వెళుతున్న ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధయులను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు, సుబ్రహ్మణ్యం, కరీముల్లా, రమేష్, జిల్లా స్థాయిలో ఎంపికైన గూడూరు డివిజన్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు, డీజిల్, గ్యాస్ నిక్షేపాలకు పరీక్షలు

ప్రజాశక్తి - వాకాడు: భూగర్భంలో పెట్రోలు డీజిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయన్న ఉద్దేశంతో ఓఎన్ జి సి ఆదేశాల మేరకు జిల్లాలో మిషన్ అన్వేషణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టారు. సర్వే విజయవాడ నుంచి తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వరకు చేపట్టే విధంగా ప్రణాళిక రూపొందించారు. తాజాగా చిట్టమూరు మండలం నుండి వాకాడు మండలం పరిధిలో వ్యవసాయ భూముల్లో పరీక్షలు చేపట్టారు. మండలానికి రెండు మూడు నిక్షేపాలున్నా, సమీప అవసరాలకు వినియోగించవచ్చునని ఓఎన్జిసి ఉద్దేశం. తద్వారా వినియోగదారులపై కొంత మేరకు భారం తగ్గనుంది. ఈ నేపథ్యంలో మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సాటిలైట్ ఆధారంగా 2డి సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా 80 అడుగుల లోతులో డ్రిల్లింగ్ ద్వారా మట్టిని సేకరించి నమూనాలను ఢిల్లీకి పంపనున్నారు. అక్కడ ప్రాథమికంగా నిర్ధారణ కాగా 3డి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సర్వే పిఆర్ఓ సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుధీర్ విలేకరులతో మాట్లాడుతూ రైతులు సానుకూలంగా స్పందించి ఎటువంటి ఆటంకం లేకుండా పరీక్షలు నిర్వహించడానికి తోడ్పడ్డారని కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు, నింద్ర మండలానికి చెందిన ఒకరు, నగరి మున్సిపాలిటీకి చెందిన 12 మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. చికిత్స కోసం అయిన బిల్లులను ఎమ్మెల్యే భాను ప్రకాష్ సీఎం సహాయనిధికి రెకమెండ్ చేసి పంపారు. విడుదలైన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. పుత్తూరు మున్సిపాలిటీ, మిద్దిగుంటకు చెందిన చాముండేశ్వరికి రు.25,000, 2 వ వార్డు కు చెందిన సుగుణకి రు.24,800, నింద్రకు చెందిన డేవిడ్‌కి రు.10,000, నగరి మున్సిపాలిటీ, చింతల పట్టెడకు చెందిన ఎం. ఆర్. రాజేంద్రన్‌కి రు.14,321, ఎం. ఎన్. సుభద్రకి రు.35,541, పుదుపేటకు చెందిన వి.ఎం. దేవికి రు.40,112, జే.డి.పుష్ప కు రు. 60,000, వినాయకపురం ప్రాంతానికి చెందిన కె. కె. శ్రీనివాసన్‌కు రు.74,995, సత్రవాడకు చెందిన ఆర్.సావిత్రికి రు. 25,000, పద్మావతి నగర్‌కు చెందిన ఎస్.విజయలక్ష్మికి రు. 37,378, ఏకాంబరకుప్పంకు చెందిన కె.వి.కృష్ణన్‌కు రు.32,000, అరవకాపు వీధికి చెందిన కె. నాగరాజుకు రు.31,843, సత్రవాడకు చెందిన తిరునాకరసు కు రు.57,937, ఏకాంబరకుప్పంకు చెందిన కృష్ణవేణికి రు. 25,524, కెవిఆర్. పేటకు చెందిన విఎం దుర్గకు. 42,746, మొత్తం 15 మందికి రు.5,37,107 ల చెక్కులు అందచేశారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అర్హత కలిగిన రైతులకు మాత్రమే ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం తెలిపారు. మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా దుర్వినియోగం కాకుండా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రైతులకు యూరియా కార్డులు పంపిణీ చేయడం అవకతవకలను అరికట్టేందుకేనని తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా లభిస్తుందని తెలిపారు. 14 రైతు సేవ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : రైతులు యూరియా కోసం అధైర్య పడాల్సిన అవసరం లేదని భైరవరం, బాలాయపల్లి సొసైటీ ల అధ్యక్షులు దాసరి ప్రభాకర్ నాయుడు, రాయి సత్యనారాయణలు తెలిపారు. బుధవారం భైరవరం, బాలాయపల్లి సొసైటీల ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో యూరియా కొరత లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు దాసరి రాజగోపాల్ నాయుడు, మండల ప్రదాన కార్యదర్శి కూను శ్రీహరి, రమేష్ నాయుడు, జయరాం నాయుడు, రాపూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆషా ఆధ్వర్యంలో బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట మండలం, కొత్తపాలెం, ఎస్టీ కాలనీ, వెద్దల్ల చెరువు ఎస్టి కాలనీల్లోని తాగునీటి చేతి బోర్లు పనిచేయడం లేదని స్థానికులు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించిన జూలియన్ రాజు బోర్ మెకానిక్ సహాయంతో బుధవారం రెండు బోర్లను మరమ్మత్తులు చేసి గిరిజనులకు తాగునీరు ను అందుబాటులోకి తెచ్చారు. గిరిజనులు జూలియన్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. జూలియన్ రాజు మాట్లాడుతూ గిరిజన కాలనీలలో సమస్యలు ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని ఆషా స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా తన వంతు సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణ పరిధిలోని బూడిదమిట్టలో నిర్మించిన ఓ అక్రమ కట్టడాన్ని బుధవారం సాయంత్రం మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు. సదరు వ్యక్తి మున్సిపల్ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రవేశించి గోదామును నిర్మించాడనీ, దీంతో కూల్చి వేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ మీడియా ముఖంగా తెలియజేశారు. ఎవరైనా మున్సిపల్ స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి సాయాన్ని బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అందజేశారు. మొత్తం రూ. 4.61 లక్షల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. కూటమి ప్రభుత్వ ఏడాదిన్నర పాలనలో రూ. 2 కోట్లకు పైగా సొమ్మును సీఎం సాయం కింద లబ్ధిదారులకు అందజేసినట్లు బృందమ్మ తెలిపారు.

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ప్రాముఖ్యత ఇవ్వండి

ప్రజాశక్తి - సత్యవేడు: తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి జెండా మోసిన కార్యకర్తలకు మండల కమిటీల ఏర్పాటులో, పార్టీ కార్యక్రమాలలో ప్రాముఖ్యత ఇవ్వాలని సత్యవేడు నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలను కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం సత్యవేడు నియోజకవర్గం నుండి 70 మంది తెలుగు తమ్ముళ్లు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకొని ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబును, ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను, పల్లా శ్రీనివాసరావు, జోనల్ ఇంచార్జ్ దీపక్ రెడ్డిని కలిసి సత్యవేడు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితుల గురించి వివరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు మండల కమిటీ ఏర్పాటులో ప్రాముఖ్యం కచ్చితంగా ఉంటుందని కేంద్ర పార్టీ కార్యాలయంలోని ముఖ్య నేతలు హామీ ఇవ్వడంతో సత్యవేడు తెలుగు తమ్ముళ్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పరమశివం భాష, కె వి బి పురం మండల నాయకులు రామాంజనేయ నాయుడు మరియు సత్యవేడు నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వాహనంతో సహా ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: భాకరాపేట అటవిక్షేత్రాధికారి వెంకట రమణకు అందిన రహస్య సమాచారం మేరకు వాహనంతో సహా ఎర్రచందనం స్మగ్లర్లు అదుపులోకి తీసుకున్నట్లు బుధవారం మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రావారిపాలెం మండలం, ఎల్లమంద రోడ్డు మార్గంలో అక్రమంగా తమిళనాడుకు ఎర్రచందనం తరలిస్తున్నారని బుధవారం తెల్లవారుజామున తను సిబ్బందితో కలిసి కాపు కాయడం జరిగిందని పేర్కొన్నారు. ఎల్లమంద రోడ్డు మార్గంలో కారు వేగంగా పీలేరు రోడ్డు వైపు వెళ్లి ఎల్లమంద ఎస్సీ కాలనీ వద్ద కల్వర్టును ఢీకొని కారును వదిలి పారిపోతుండగా చుట్టుముట్టి స్మగ్లర్ను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్ తమిళనాడుకు చెందిన రామన్ చిన్నయన్‌గా గుర్తించామన్నారు. పట్టుబడ్డ కారును పరిశీలించగా ఐదు ఎర్రచందనం దుంగలు దొరికాయని, వాటి విలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ దాడిలో ఎఫ్ ఎస్ ఓ మునిస్వామి నాయక్, ఎఫ్‌బిఓలు, లక్ష్మీ ప్రసాద్, రాజేష్ కుమార్, రవి, సదా శివయ్య, డ్రైవర్ శంకర్, రోహిత్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఒకటవ పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన చోటుచేసుకుంది. రెండోపట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు స్థానిక మిట్టపాళెం ప్రాంతంలోని నివాసముంటున్న శారదమ్మ, మల్లికార్జున దంపతులు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారన్నారు. మంగళవారం ఉదయం వీరిద్దరు ఇంటికి తాళాలు వేసుకుని పాఠశాలకు వెళ్లారన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి వీరి గేటుకు వేసివున్న తాళం మారిపోయి ఉండటాన్ని గమనించి చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో క్లూస్ టీం పిలిపించి వేలిముద్రలను సేకరించామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టుకుని ఇంటిలోనికి ప్రవేశించి బీరువాను తెరిచి అందులో లాకర్లో ఉన్న సుమారు 19 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్వర్ణముఖిలో గుర్తు తెలియని మృతదేహం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక సన్నిధి వీధి, జలవి నాయకుడి గుడి సమీపంలోని స్వర్ణముఖి నదిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు(సుమారు 60 ఏళ్ళు) గళ్ళ లుంగీ, తెల్ల చొక్కా ధరించి ఉన్నాడనీ, ఆచూకీ తెలిసినవారు సెల్: 9440796762 నంబరుకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ల అరెస్ట్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి శ్రీకాళహస్తి ప్రాంతంలో 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ ఈశ్వర్ రెడ్డి బృందం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిందని తెలిపారు. బుధవారం తెల్లవారుజామున రాగిగుంట సెక్షన్ తీర్థాల పాలకోనకు చేరుకోగా కొంతమంది వ్యక్తులు గుమికూడి ఉండడాన్ని గుర్తించి వారి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులను చూసినవారు పారిపోయే ప్రయత్నం చేయగా, వెంబడించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆ పరిసర ప్రాంతాలలో పరిశీలించగా 20 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు తిరుపతి జిల్లాకు చెందినవారు, మిగిలిన ఏడు మంది తమిళనాడు రాష్ట్రానికి చెందినట్లుగా గుర్తించామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

యస్వీయూ పరిధిలో డిగ్రీ పరీక్షల ఫీజు గడువు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరిధిలో డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు ఫీజు చెల్లింపు ప్రక్రియ మొదలైనట్లు యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రెండు సెమిస్టర్లలో పరీక్ష రాయదలచిన విద్యార్థులు నవంబర్ 14 వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా, నవంబర్ 18 వరకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు. కావున విద్యార్థులు సంబంధిత కళాశాలలో పరీక్ష ఫీజులు చెల్లించి నమోదు చేసుకోవాలని విశ్వవిద్యాలయం పరీక్షల అధికారి తెలిపారు.

కూరగాయలు, బియ్యం వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండ లం, తడుకు పంచాయతీ పరిధి, వీఎస్ఎస్ పురం గ్రామంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో వెంకటేష్ కుటుంబం నివసిస్తున్న గుడిసె మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న తడుకు వైస్సార్సీపీ నాయకులు దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం, నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ద ఆఫ్ డే లీవ్' సినిమాలో హీరోగా యర్రావారిపాలెం యువకుడు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని బండకాడపల్లికి చెందిన అంగేరి ఈశ్వరయ్య కుమారుడు లోకేష్ హీరోగా నటించిన ద హాఫ్ డే లీవ్ సినిమా నవంబర్ 9వ తేదీ రిలీజ్ అవుతుందని తెలిపారు. మారుమూల ప్రాంతం నుంచి బీటెక్ చదువుకొని ఎన్నో ఉడుదుడుకులు బాధలు కష్టాలు అనుభవించి హీరోగా సినిమాలో నటించడం జరిగిందని బుధవారం మీడియాకు తెలిపారు. హీరో లోకేష్ మాట్లాడుతూ సినిమాలో నటించడం తన ఫ్యాషన్ అని, చాలా రోజుల తర్వాత సినిమా ఛాన్స్ దొరకడం భగవంతుని కృప అని పేర్కొన్నారు. మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించి సినిమా హీరోగా ఛాన్స్ రావడం నా అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు. 9వ తేదీ ప్రతి ఒక్కరు సినిమాను చూసి ఆదరించాలని కోరారు.

పూర్ణాహుతి హోమానికి హాజరైన తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో పూర్ణాహుతి హోమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి సతీసమేతంగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి దంపతులకు దేవస్థానం చైర్మన్, పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తితిదే పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, తెదేపా స్టేట్ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ , తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్ (మక్కి యాదవ్),పాలకమండలి సభ్యులు వారి కుటుంబ సభ్యులతో కలసి పూజలు నిర్వహించడం జరిగింది.

శ్రీనివాస సత్రం బీచ్‌ను సందర్శించిన తహశీల్దార్

ప్రజాశక్తి -కోట : కోట మండలం, శ్రీనివాస సత్రం బీచ్‌ను కోట తాహాసిల్దార్ కటారి జయ జయ రావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, మెరైన్, సివిల్ పోలీసుల పర్యవేక్షణలో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బీచ్ పరిసర ప్రాంతాల్లో అనవసరమైన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మెరైన్, సివిల్ పోలీసులు, రెవిన్యూ అధికారులతో జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. అక్కడి స్థితిగతులను మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ శ్రీనివాసులు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సకాలంలో టార్గెట్‌ను పూర్తి చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : యాన్యువల్ డిస్ట్రిక్ట్ క్రెడిట్ ప్లాన్ టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఎల్డీఎం రవికుమార్ సూచించారు. గూడూరు ఎంపీడీవో కార్యాలయం, సమావేశ మందిరంలో బుధవారం జేఎల్‌ఎంబిసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది యాన్యువల్ డిస్ట్రిక్ట్ క్రెడిట్ ప్లాన్ టార్గెట్ 29614 కోట్లు కాగా సెప్టెంబరు వరకు రూ.20176 కోట్లతో 68 శాతం సాధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ ఏపీడి ప్రభావతి, మెప్మా డీపీఎం ప్రమీల, డిఆర్‌పి చంద్రబాబు, ఏపీఎం బుజ్జమ్మ, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - రేణిగుంట: మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజ, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటయ్య, రేణిగుంట పంచాయతీ వార్డు మెంబర్ రాజేష్ రెడ్డి బుధవారం రేణిగుంటలోని శ్రీ కాళహస్తి రోడ్డులో దోమల లార్వా వృద్ధిని పరిశీలించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కామరాజు మాట్లాడుతూ వర్షాల నేపధ్యంలో ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం విజయ, ఎమ్ఎల్హెచ్పీ యమున, ఆశాకార్యకర్త మోహిని, వార్డు మెంబర్ రాజేష్ రెడ్డి, యూనిట్ ఆఫీసర్, వెంకటయ్య,సూపర్వైజర్ కామరాజు,మహిళలు పాల్గొన్నారు.

తహశీల్దారుకు అభినందన



ప్రజాశక్తి -కోట : తుపాన్ నేపథ్యంలో ప్రజలకు విశేష సేవలందించిన తహశీల్దార్ కటారి జయ జయ రావు సీఎం చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కోట తహశీల్దార్ కార్యాలయంలో బహుజన నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో బహుజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజురు మాధవ్, ఇంగిలాల మదన్ మిశ్రా,పాల మల్లి, పనబాక హేమంత్,కర్లపూడి వెంకటరమణయ్య,దాసరి అశోక్ కంబ్లె,పిండి కేశవ,నెలవాయి నాగేంద్ర,కుదురు కోటి,జోరెపల్లి తేజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పుష్ప అలంకరణలు చేసి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తిక పౌర్ణమి పూజలు చేసి మహిళలు దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. విచ్చేసిన భక్తులు కొరకు నంది భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేసినట్లు ఈవో రవీందర్ రాజు పేర్కొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవాన్ని ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి శివరాత్రితో సమానంగా భావిస్తారని, విద్యార్థులు హిందు ధర్మాన్ని, పండుగల ప్రాశస్త్యాన్ని భావితరాలకు అందించే సారధులని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. ప్రియవర్ధన బాబు, వై. గంగాధర్ రావు, కె. కృష్ణ కిషోర్, డా. వి. ప్రసన్న లక్ష్మీ, డా. సి.ఎల్.చెన్నా రెడ్డి, తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర, హాస్టల్ సిబ్బంది, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, ఎన్ సి సి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా గూడూరు పట్టణంలోని శివాలయంలో శివపార్వతులకు విశేషాలంకరణ ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించి శివపార్వతులను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గూడూరు పట్టణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా శివునికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాన్ని డాక్టర్ జనార్ధన్ రెడ్డి రోహిణి దంపతులు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గూడూరు పట్టణ సమీపంలోని కాశీ లేఔట్ లో ఉన్న శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామివారికి అభిషేకం విశేషా ఆలంకరణ వైభవంగా నిర్వహించారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు అయ్యప్ప మాల ధారణ భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలోని పురాతన దేవాలయం పంటరంగం లోని పాండురంగ స్వామి గుడిలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని దేవాదాయ శాఖ ఏర్పాటుచేసిన ముందస్తు భద్రతా చర్యలను ఎంపీడీవో సాయిప్రసాద్, తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు పరిశీలించారు. అనంతరం మోనపాలెం సముద్ర తీరాన్ని అక్కడ స్థితిగతులను పరిశీలించి గస్తీ నిర్వహిస్తున్న శ్రీహరికోట మెరైన్ పోలీసులతో భద్రత నిర్వహణ విషయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్ బాబు, టిడిపి సీనియర్ నాయకుడు మామిడి గోవిందయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, శ్రీహరికోట మెరైన్ సీఐ, ఎస్పై మెరైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని కమ్మపల్లి సమీపంలో ఉన్న యోగుల పర్వతంపై కార్తీక దీపోత్సవం నిర్వహించారు. బుధవారం ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో ఉదయం శివలింగానికి అభిషేకాలు, హెూమాలు నిర్వహించారు. 6 అడుగుల ఎత్తైన దివ్య దీపం (కొప్పెర).1503 కిలోల నెయ్యి, 2000 మీటర్ల ఒత్తి వినియోగించి సజీవ జ్యోతిగా ప్రతిష్ఠించారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతలను పెంపొందించుకోవాలని మతంగా మహా పీఠాధిపతి మాతానందగిరి స్వామి కోరారు. మండలంలోని తిమ్మరాజు పల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ శాంతి ఆశ్రమంల. కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం జరిగింది.ఆధ్యాత్మిక వాతావరణంలో మతంగా మహా పీఠాధిపతి మాతానందగిరి స్వామి భక్తులకు ఆధ్యాత్మిక బోధన చేశారు. మానవాళి మనుగడకు ధర్మం, శాంతి, సేవ అనే మూడు మూలాధారాలని ఆయన పేర్కొన్నారు..ఈ కార్యక్రమాన్ని ఉభయ దారులు ముమ్మిడి శ్రీదేవి%-%లీలాకృష్ణ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక ఆల్ ఇండియా కన్వీనర్ శ్యాం ప్రసాద్ , హైకోర్టు డిప్యూటీ సొలిసీటర్ జనరల్ పున్నారావు , వెంకట్ రెడ్డి, మన్మధరావు, గరిక ముక్కు సుబ్బయ్య, గుటుకుల జాషువా, మోహన స్వామి, పెనుబాల చంద్రశేఖర్, గీతాదేవి, పామూరు సుబ్రహ్మణ్యం, వి కే ఆర్ ఆర్ గ్యాస్ ఎండి మనోజ్ కుమార్ రెడ్డి, మన్మధరావు, అనంతరం ,భక్తులకు ప్రసాదం పంపిణీ చేయబడింది.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వరాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం నిర్వహించిన శ్రీ కామాక్షి దేవి అన్నాభిషేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఘనంగా దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో ఉపవాస దీక్షలతో పాల్గొని 365 వత్తులతో ఆలయ ప్రాంగణాన్ని దీపాలంకరణ చేశారు. దీపాల కాంతులతో కమ్ముకున్న ఆలయ వాతావరణం భక్తి మయంగా మారింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక భక్తులు ఈ వేడుకను "దీపోత్సవం లాగా ఆధ్యాత్మికంగా" ప్రతి దీపం భక్తి వెలుగుని ప్రసరించిందని, మహిళల అభివర్ణించారు.

శ్రీ మూల స్థానేశ్వరునికి పోనకా దేవసేనమ్మ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో కొలువై ఉన్న శ్రీ భువనేశ్వరి దేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కార్తీక దీపాన్ని వెలిగించారు.

కేన్సర్ అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగంలోని "సూక్ష్మ వీక్షణ" విద్యార్థి యూనిట్, మైక్రోబయాలజిస్ట్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఎన్.ఎస్.ఎస్. యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఒక అవగాహన కార్యక్రమం సవేరి సెమినార్ హాల్లో నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, తిరుపతికి చెందిన డా. పి. నాగేశ్వర రెడ్డి గారు ఈ సందర్భంగా బోధనాత్మక ఉపన్యాసం ఇచ్చారు. ఆయన స్తన క్యాన్సర్, గర్భాశయ ద్వార క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ క్యాన్సర్ యొక్క కారణాలు, ప్రారంభ లక్షణాలు, స్తన స్వీయ పరీక్ష యొక్క ప్రాముఖ్యత, మరియు స్క్రీనింగ్ పరీక్షల అవసరం గురించి వివరించారు. అలాగే ఆయన మామోగ్రామ్ పరీక్షలు ప్రాథమిక దశలో క్యాన్సర్ గుర్తింపులో ఎంత ముఖ్యమో వివరించి, క్యాన్సర్ దశ మరియు వైద్య చరిత్ర ఆధారంగా చికిత్సా పద్ధతుల గురించి వివరించారు. మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్ స్తన క్యాన్సర్ అని, తదుపరి గర్భాశయ ద్వార క్యాన్సర్ అని ఆయన పేర్కొంటూ, సర్వైకల్ క్యాన్సర్ నివారణలో వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వారిలో ప్రొ. పి. సువర్ణలతా దేవి, ప్రొ. చంది ఎం. కుమారి, ప్రొ. పి. ఉమా మహేశ్వరి దేవి, ప్రొ. ఆర్. జయమధురి, డా. ఎం. వాణి, డా. కె. జ్ఞానేశ్వరి, డా. కె. రుక్మిణిలు ముఖ్యంగా ఉన్నారు. విద్యార్థులు చురుకైన పాల్గొనడం వల్ల ఈ కార్యక్రమం మరింత సమాచారపరమైనదిగా, ప్రభావవంతమైనదిగా నిలిచింది. సుమారు 90 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మహిళల్లో స్తన, గర్భాశయ ద్వార క్యాన్సర్ పై శాస్త్రీయ అవగాహన కల్పించడం, ప్రారంభ దశలో స్క్రీనింగ్ అవసరాన్ని తెలియజేయడం, వ్యాక్సినేషన్ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి సారించడం లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మైక్రోబయాలజిస్ట్స్ సొసైటీ ఆఫ్ ఇండియా యూనిట్, అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి సంయుక్తంగా నిర్వహించారు.

ఘనంగా విరాట్ కోహ్లీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కోట : భారతదేశ ప్రముఖ బ్యాట్స్ మెన్ శ్రీ విరాట్ కోహ్లీ 38 వ జన్మదిన సందర్భంగా ఎస్వీ మెడికల్ షాప్,ఫ్యాన్సీ విద్యానగర్ యజమాని,లైన్ మెన్ మల్లాం రమేష్ ఆధ్వర్యంలో దేవా వారి బృందం కోహ్లీ జన్మదిన వేడుకలు రాజుపాలెం గూడలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్య కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. తదుపరి విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,యువత పాల్గొనడం జరిగింది.

అల్పాహార వితరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆధ్వర్యంలో ఆవరణలో పేదలకు అల్పాహారం వివరణ చేసింది. అలాగే గర్భిణీలు, వారి సహాయకులకు బిపి, షుగర్ టెస్టులు నిర్వహించారు. అల్పాహారం దాత జి. సత్యనారాయణ . ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ మక్కిన భాస్కర్, లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షులు లయన్ బండి మధుసూదన.రెడ్డి, కార్యదర్శి లయన్ చున్నుపాటి చక్రపాణి, ఉపాధ్యక్షులు లయన్ జి . శంకరయ్య, కోశాధికారి లయన్ వి పురుషోత్తమ నాయుడు, సభ్యులు లయన్ రామారావు, లయన్ రామచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్లియర్ చేయండి సారూ..



ప్రజాశక్తి - వ్ర త్యా ర ం టౌన్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్కు ఆటంకం కలిగిస్తూ నిలిపి ఉంచిన పోలీసు వాహనంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సాధారణంగా ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే ప్రజలపై చర్యలు తీసుకునే పోలీసులు... స్వయంగా నియమాలను అతిక్రమించడం ప్రశ్నార్థకంగా మారింది. రోజువారీగా పట్టణంలో ట్రాఫిక్ తీవ్రంగా ఉండే సమయాల్లో కూడా పోలీసు వాహనం రహదారి మధ్యలో నిలిపి ఉంచడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో పోలీస్ వాహనం చూసి యధాతధగా మరి కొన్ని కార్లు వాహనాలు పార్కింగ్‌గా వాడేసుకున్నారు. దీంతో కొంతసేపు వాహనల రద్దీ పెరగడంతో చిన్నపాటి ట్రాఫిక్ జామ్ కూడా ఏర్పడుతున్నాయి. అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజా వీధిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానములో రెడ్ సంస్థ ఆద్వర్యంలో ఇన్నర్ వీల్ అండ్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథి గా డాక్టర్ రోహినమ్మ విచ్చేశారు. దాతలుగా స్వర్ణమ్మ - పరమేశ్వరమ్మ ఐదు వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో,ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి మాధురి , కార్యదర్శి లక్ష్మీ, పవిత్ర, రెడ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం: రైతులందరూ పొలాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని సికె పల్లి పంచాయతీ గొల్లపల్లిలో యో రీసెర్చ్ ఇన్పుట్ సెంటర్ ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా రైతులు జీవన ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయడానికి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై జ్ఞానాన్ని పంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. బిఆర్సి సెంటర్ యజమాని నాగమణి మాట్లాడుతూ తిరుపతి జిల్లా డిపిఎం షణ్ముగం ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ ఉత్ప్రే రకాలు ఘనజీవామృతం, ద్రవ జీవమృతం, పంటలో తెగుళ్ళకు నివారణకు వాడే కషాయాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మమత, సంఘమిత్ర మునీశ్వరి, గ్రామస్తులు కుప్పారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాగమ్మ, లాలమ్మ, సుమతి, నాగరాజు,కపిలేశ్వరయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్సిపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో జరిగి కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. పనపాకం హరిజనవాడలో జరిగిన కోటి సంతకాల సేకరణలో మోహిత్రెడ్డి స్థానికులతో మాట్లాడుతూ, కోటి సంతకాల సేకరణకు ప్రజలనుంచి మంచి స్పందన ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతోపాటు వాటి అనుబంధ ఆసుపత్రులను ప్రవేటు పరంచేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో హేమేంద్రకుమార్ రెడ్డి, వెంకటరత్నం, చెంగల్రాయులు, చంద్రమౌళిరెడ్డి, దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.